తాటి పీచు పరిశ్రమకు కష్టకాలం

- కరోనా నుంచి కోలుకోలేని దెబ్బ
- తగ్గిన ధరలు, ఎగుమతులు

నల్లజర్ల: తాటిపీచు పరిశ్రమకు కష్టకాలం వచ్చింది. నాలుగేళ్ల క్రితం వచ్చిన కరోనా వైరస్ ఎఫెక్ట్ ఈ పరిశ్రమపై పడింది. ఇక్కడ తయారు చేసిన తాటి పీచు మన తెలుగు రాష్ట్రాల నుంచి చైనా, కొలంబో, తైవాన్, ఇండోనేషియా, వియత్నాం, బ్యాంకాంగ్ దేశాలకు తాటి పీచు ఎగుమతవుతుంటాయి. వీటన్నింటిలో ముఖ్యంగా చైనాకు 90 శాతం వరకు ఎగుమతులు జరుగుతాయి. అక్కడ బ్రష్‌లు తయారు చేసి జపాన్‌కు విక్రయిస్తూ ఉంటారు. కరోనా తగ్గుముఖం పట్టినా చైనా ఇప్పటికి ఆ పరిస్థితి నుంచి కోలుకోలేదు. ఆ టైములో అక్కడ ఎక్కువ రోజులు తాటిపీచు పరిశ్రమలు మూతపడ్డాయి. దీంతో కార్మికులు ప్రత్యామ్నాయ పనులలో చేరారు. అక్కడ లేబరు కొరత కారణంగా మన రాష్ట్రంలోని తాటిపీచు పరిశ్రమ సంక్షోభంలో పడింది. ఎగుమతులు లేక పోవడం, ధరలు తగ్గడంతో స్థానికంగా ఉన్న కార్మికులు సైతం ఈ తాటిపీచు పరిశ్రమను వదిలి ఇతర పనుల వైపు తరలిపోయారు. నల్లజర్ల మండలంలో దాదాపు వెయ్యి మంది ఈ పరిశ్రమపై ఆధారపడి జీవించేవారు. నల్లజర్లలో శ్రీదేవి ఎక్స్‌పోర్టర్స్ సంస్థ ఒక్కటే తాటి పీచు ఎగుమతి చేస్తోంది. వారికి ఆర్డర్లు లేకపోవడంతో కొనుగోలు తగ్గించారు. దీంతో ఈ పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగా పని చేసే కార్మికులు ఇతర పనులు చూసుకున్నారు. కిలో తాటి పీచు రూ.85 నుంచి రూ.60 తగ్గింది. ఏటా 40 నుంచి 50 టన్నులు ఎగుమతి అయ్యే తాటిపీచు నేడు పది టన్నులకు పడిపోయింది. తద్వారా మనదేశానికి వచ్చే విదేశీ మారక ద్రవ్యం సైతం తగ్గిపోయింది. ఎప్పుడైన ఆర్డర్లు రావొచ్చుననే ఉద్దేశంతో నల్లజర్లలోని శ్రీదేవి ఎక్స్‌పోర్టర్స్ సంస్థ కొద్ది కొద్దిగా పీచు కొనుగోలు చేసి దాదాపు 300 టన్నుల వరకు పీచు స్టాకు పెట్టి ఉంచారు. ఆర్డర్ల కోసం ఎదురుచూస్తున్నారు.

రెండు యూనిట్లు సొంతంగా నిర్వహిస్తున్నా..



తాటిపీచు పరిశ్రమలో కూలీలకు ధర గిట్టుబాటు కాక ఇతర పనులకు వెళుతున్నారు. ఈకారణంగా నేనే సొంతంగా రెండుయూనిట్లు పెట్టి 12 మంది కూలీలకు ఉపాధి చూపుతున్నాను.ఎగుమతులు లేవు. ఇప్పటి వరకు 300 టన్నుల వరకు తాటిపీచు తయారు చేసి సిద్ధం చేశాం. ఆర్డర్ల కోసం ఎదురు చూస్తున్నాను.

– వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, శ్రీదేవి ఎక్స్‌పోర్టర్స్ అధినేత, నల్లజర్ల



నల్లజర్లలో శ్రీదేవి ఎక్స్‌పోర్ట్స్ సంస్థలో తాటిపీచు ప్రాసెసింగ్ చేస్తున్న కూలీలు



ఎగుమతికి సిద్ధంగా ఉన్న తాటిపీచు బేళ్లు



మట్టల నుంచి తాటిపీచు తీస్తున్న కార్మికుడు

క్లుప్తంగా

సబ్ రిజిస్ట్రార్‌గా సుందరరావు

కొవ్వూరు: స్థానిక సబ్ రిజిస్ట్రార్‌గా కె.సుందరరావు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఈ.వెంకటేశ్వరరావు అనంతపల్లి బదిలీ అయ్యారు. రాజమహేంద్రవరంలోని పిండిగొయ్యి సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సుందరరావు బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసే ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు, ఒక సీనియర్ అసిస్టెంట్, ఒక షరాబు బదిలీ అయ్యారు. ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు నిడదవోలు, ఒకరు జంగారెడ్డి గూడెం , సీనియర్ అసిస్టెంట్ పోలవరం బదిలీ అయ్యారు. షరాబు జంగారెడ్డిగూడెం బదిలీ అయ్యారు. దీంతో ఈ కార్యాలయానికి అందరూ కొత్త వాళ్లు రానున్నారు.

మానవత మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలి

గోపాలపురం: మండల మానవత స్వచ్ఛంద సంస్థ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని మానవత చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు అన్నారు. గోపాలపురం మండలం సాగిపాడు లెప్రసీ కాలనీలో 27 మంది రోగులకు మండల మానవత అధ్యక్షుడు పప్పు సత్యకృష్ణారెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం బియ్యం, భోజనాలు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న చైర్మన్ జె.రాంబాబు మాట్లాడుతూ జిల్లా మానవత సంస్థా సభ్యత్వాల నమోదు, సేవా కార్యక్రమాల్లో ముందంజలో ఉండడం హర్షనీయమన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించే దిశగా మానవత సభ్యులు పనిచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు నెల్లి చంద్రశేఖర్, గెడ జోగేంద్రప్రసాద్, కె.కీర్తికుమార్, గుబ్బా లక్ష్మణరావు సభ్యులు పాల్గొన్నారు.

బాలికల హక్కులపై అవగాహన

గోపాలపురం: బాలికలు హక్కులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సర్పంచ్ అన్నెపు వెంకటలక్ష్మి అన్నారు. భీమోలులో శుక్రవారం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జేవీ రమణ మాట్లాడుతూ కిశోర బాలికలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

గోపాలపురం: ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేయాలని పంట వివరాలు నమోదు ప్రక్రియ ద్వారానే పంటల కొనుగోలు జరుగుతుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.మాధవరావు అన్నారు. కోమటికుంటలో గెడ జోగేంద్రప్రసాద్ వరిపంట పొలాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ ఈ పంట నమోదు రైతుకు సంబంధించిన ఏ పంట అయినా నమోదు ద్వారానే ప్రభుత్వ పథకాలు అమలు అవుతాయన్నారు. రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. మండలవ్యవశాయశాఖ అధికారి బి.రాజారావు సిబ్బంది ఉన్నారు.

ఈ-క్రాప్ నమోదు పరిశీలన

నల్లజర్ల: మండలంలోని అనంతపల్లి, పోతవరం, నల్లజర్ల గ్రామాలలో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, టెక్నికల్ ఏఓ శ్రీనివాసరావు శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. అనంతపల్లిలో రైతు దండమూడి యుగంధర్ శ్రీనివాస్ పొలంలో రైతు ఏ రకమైన పంట వేశారు, ఈ -క్రాప్ నమోదుకు చేశారా లేదా అనే విషయాలను పరిశీలించారు. ఆయనతో పాటు మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్, వీఏఏలు జాన్‌పాల్, భవాని, హేమంత్, అనూష, రైతులు ఉన్నారు.

పశివేదలలో ఎల్‌పీసీఎస్ మహాజన సభ

కొవ్వూరు: పశివేదలలో రంగరాయ ఎల్‌పీసీలో శుక్రవారం అసిస్టెంట్ రిజిస్ట్రర్, పర్సన్ ఇన్‌చార్జి కె.నాగేశ్వరరావు అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఈ సమావేశంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ రిపోర్టును ఆమోదిస్తూ తీర్మానించారు. దీని ప్రకారం నికరలాభం రూ.1,21,65,078గా ఉందని, సంఘ సభ్యుల షేర్ 15శాతం డివిడెంట్ చెల్లించేలా ఆమోదించారు. సంఘ సభ్యుల నుంచి రూ.1,11,92,140 డిపాజిట్లు సేకరించామన్నారు. సభ్యులకు రూ.24,64,78,366 అప్పులు ఇచ్చియున్నారన్నారు. సాలుసరి నివేదికను కరుటూరి శ్రీనివాస్ సమర్పించారు. గారపాటి రామచంద్రరావు, గారపాటి శ్రీనివాస రావు,పరిమి సోమరాజు, అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు మున్సిపల్ విద్యార్థులు

నిడదవోలు : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిడదవోలు ప్రభుత్వ హైస్కూల్లో ఈనెల 23, 24 తేదీల్లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి అండర్ 14 -17 ఆటల పోటీలలో స్థానిక ఎల్‌ఎల్‌ఆర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభా చూపారు. ఆటల పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం కే కృష్ణకుమారి తెలిపారు. అండర్ -17 విభాగంలో అథ్లెటిక్స్, లాంగ్ జంప్ పోటీలలో ఎ.చరణ్ సంతోష్ ప్రథమ స్థానం, ఆర్.వరప్రసాద్ ద్వితీయస్థానం సాధించారు. అదే విధంగా కబడ్డీ పోటీలో ఎ. చరణ్ సంతోష్ జిల్లా పోటీలకు ఎంపికయ్యాడు. మూడువేల మీటర్ల పరుగు పందెంలో డి.కమలాకర్ ద్వితీయ స్థానం, కోకో పోటీలో ఎం.బిందు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. వీరందరినీ శుక్రవారం హెచ్‌ఎం కె. కృష్ణకుమారి, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎం. విజయదుర్గ, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



కలవలపల్లిలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



చాగల్లులో విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చాగల్లు: రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు చాగల్లు మండలం కలవలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జొన్నకూటి శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 25వ తేదీన ఏలూరులో బిశ్వనాథ్ భర్తీయా స్విమ్మింగ్ పూల్‌లో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్-14 విభాగంలో జిల్లాస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థులు కరుటూరి గణేష్, కొయ్య కల్యాణ్‌బాబు ప్రతిభ చూపారు. వీరు త్వరలో పల్నాడు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులు కోచింగ్ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు కొయ్య గంగాధరరావును పాఠశాలలో ఉపాధ్యాయులు గ్రామ సర్పంచ్ ఆకుల లక్ష్మి, ఎస్‌ఎంసీ చైర్మన్, సభ్యులు, గ్రామపెద్దలు అభినందించారు. రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైట్టు వ్యాయమ ఉపాధ్యాయులు పి.విజయలక్ష్మి, సుధాకర్ తెలిపారు. పల్లంట్లలో జరిగిన అండర్-17 జిల్లా స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు జి.బేబి లవణ్య, జి.సింధు, కె.అన్నపూర విజయం సాధించారని, త్వరలో గుంటూరులో జరగనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు.



పెండ్యాలతో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

నిడదవోలు రూరల్: రాష్ట్రస్థాయి పోటీలకు నిడదవోలు మండలం పెండ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. విష్ణుశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఏలూరులో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ సెలక్షన్‌లో అండర్- 17 బాలుర విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థులు ఎం.లోకేష్, పి.దుర్గాప్రసాద్ ప్రతిభ చూపి పల్నాడులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. గ్రామ సర్పంచ్ తారెంకి అన్నవరం, ఎంపీటీసీ సభ్యుడు వాకా శ్రీను, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సరిదె వీర వెంకట సత్యభాస్కరరావు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

ఎండాకు తెగులు నివారణా చర్యలపై అవగాహన

ఉండ్రాజవరం : ప్రస్తుత ఖరీఫ్‌లో వరి పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలపై, ముఖ్యంగా పీఎల్‌ఏ-1100, పీఆర్ 126, సంపద స్వర్ణ వంటి రకాలల్లో ఎండాకు తెగులు సోకిందని, నివారా చర్యలు చేపట్టాలని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, శాస్త్రవేత్త డాక్టర్ మానుకోండ శ్రీనివాసు తెలిపారు. మండలంలో పసలపూడిలో వరిలో సమగ్ర సస్య రక్షణలో భాగంగా శుక్రవారం చీడపీడలపై జరిగిన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక నత్రజని వినియోగం, పోటాష్ ఎరువు వాడకపోవడం, సాగునీరు, వర్షపు నీటి ద్వారా ఎండాకు తెగులు ఉధృతిని కొంతమేర గమనించామన్నారు. తగిన యాజమాన్యం పద్ధద్ధతులు పాటించి, బాక్టీరియా ఎండు తెగులును నివారించుకోవాలన్నారు. దీని నివారణకు నత్రజని ఎరువులు వేయడం ఆపేసి, మ్యూరెట్ ఆఫ్ పోటాష్ ఎకరాకు 20 కిలోలు చల్లుకోవాలన్నారు. ఉధృతి ఎక్కువగా ఉంటే తీవ్రత తగ్గించడానికి ప్లాంటోమైసిన్ 1.0 గ్రాములు, కాపర్ హైడ్రాక్సైడ్ 2.0 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీరి చేయాలన్నారు. అవసరం బట్టి 7-10 రోజులల్లో మరో పర్యాయం పైమందు పిచికారీ చేయాలన్నారు. డాక్టర్ ఎం.శ్రీనివాసు మాట్లాడుతూ రైతులు సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. వచ్చే దాళ్వాకు అధిక దిగుబడి నిచ్చే రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. బీఆర్‌సీ ఏడీఏ జయరామలక్ష్మి మాట్లాలడుతూ నేల పరీక్ష ఆధారిత పోషక యాజయాన్యం పాటించాలన్నారు. మండల వ్యవసాయాధికారి ఎం.విశ్వాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ భీమరాజు, అభ్యుదయ రైతులు సుంకర శ్రీనివాస రావు, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.



పసలపూడిలో రైతు శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు

నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పూజలు



వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు తిరుపతి వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం విషయంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాలకు నిరసనగా పట్టణంలో బసివి రెడ్డిపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో ఈ పూజా కార్యక్రమాలకు హాజరు కావాలని ఆయన కోరారు. మధ్యాహ్నం రెండున్నర గంటలకు రాజమహేంద్రవరంలో జిల్లా వైఎస్సార్ సీపీ నూతన అధ్యక్షుడిగా చెల్లుబోయిన వేణుగోపాల్ ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆనంద రీజెన్సీలో పందిరి పంక్షన్ హాలులో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

నిడదవోలు: పట్టణంలోని గణపతి సెంటర్‌లో ఉన్న కొత్తపల్లి స్వీట్స్ అండ్ హోమ్ ఫుడ్స్ షాపులో విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ, ఫుడ్ సేఫ్టీ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా షాపులో ఉన్న పలు ఆహార పదార్థాల శ్యాంపుల్స్ సేకరించారు. షాపులో 120 మైక్రాన్ తక్కువ ఉన్న ప్లాస్టిక్ కవర్లు ఉండడంతో మున్సిపల్ అధికారులు అపరాధ రుసుం కట్టించుకున్నారు. షాపులో కాలపరిమితి దాటిన ఖాటాను గుర్తించి కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా షాపులపై విజిలెన్స్ దాడుల సమాచారం తెలుసుకున్న పలు షాపుల యాజమాన్యం తమ షాపులను మూసివేసి తాళాలు వేసి ఇళ్లకు వెళ్లిపోయారు. నిడదవోలు కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బచ్చు సుమన్, మాజీ అధ్యక్షుడు పూసరపు వెంకటేశ్వరావు కూడా అధికారులతో పాటు తనిఖీలలో భాగస్వాములు కావడంతో తనిఖీలు సక్రమంగా జరిగాయా లేదా అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. పట్టణ పరిధిలో ఒక్కషాపులోనే తనిఖీ చేయడంతో మరిన్ని అనుమానాలకు తావిస్తున్నాయి. అధికారులు తనిఖీలు చేస్తున్న సమయంలో కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు అధికారుల దగ్గర ఉండడమేమిటని పట్టణ వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. పట్టణంలో పలు దుకాణాల్లో ఆహార నియమాలు పాటించడం లేదని వినియోగదారులు చెబుతున్నారు. పట్టణ పరిధిలో ఉన్న అన్ని షాపుల్లో తనిఖీలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సీఐ డి.నాగవెంకటరాజు, ఫుడ్ సేఫ్టీ అధికారి రొక్కయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



పట్టణంలో కొత్తపల్లి స్వీట్స్ అండ్ హోమ్‌ఫుడ్స్ షాపులో తనిఖీలు చేస్తున్న అధికారులు

విద్యుత్ అసిస్టెంట్ ఇంజినీర్‌గా వెంకట్రావు



దేవరపల్లి: ఏపీఈపీడీసీఎల్ దేవరపల్లి అసిస్టెంట్ ఇంజినీరుగా చిలకా వెంకట్రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తాళ్లపూడి నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన కూచిపూడి కృష్ణారావు పోలవరం ఏఈగా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా అంతా శుభాకాంక్షలు తెలిపారు.

ధాన్యం కొనుగోలుకు ముందస్తు ప్రణాళిక

చాగల్లు: ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతుల నుంచి రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుపై ముందస్తు ప్రణాళిక ఏర్పాటుపై అవగాహన సమావేశం శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశం మండల స్పెషల్ ఆఫీసర్ పి.చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతు సేవ కేంద్రాల్లో గోనె సంచులు అందుబాటులో ఉంచాలని, రైతులు ధాన్యం రవాణా చేసేటప్పుడు తమకు నచ్చిన మిల్లును ఆన్‌లైన్‌లో సెలెక్ట్ చేసుకుని ధాన్యం పంపించేలా మార్పు చేశారని అన్నారు. తూనికలు కొలతలు శాఖ అధికారులు ప్రతి రైస్ మిల్ దగ్గర ఉన్న వే బ్రిడ్జిలను కొలెబ్రేషన్ ఏర్పాటు చేస్తారని అన్నారు. ఈ సమావేశంలో తహసీల్దారు యం.మెరికమ్మ, ఇన్‌చార్జి మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.నిర్మలకుమారి, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ వేణు గోపాల్, సొసైటీ సెక్రెటరీలు, కస్టోడియన్ ఆఫీసర్లు అయిన గ్రామ రెవెన్యూ అధికారులు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



చాగల్లులో మాట్లాడుతున్న మండల స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్

రూ.30 లక్షలతో జలజీవన్ పనులు

నల్లజర్ల: తూర్పు చోడవరంలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా సురక్షిత మంచినీరు అందించేందుకు రూ.30 లక్షలతో 3కిలోమీటర్ల మేర పైపులైను వేస్తున్నట్టు గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈ గిరి తెలిపారు. శుక్రవారం ఆ గ్రామంలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఏఈ అజయ్‌బాబు మాట్లాడుతూ మండలంలో మొత్తం 24 గ్రామ పంచాయతీలలో 104 కిలోమీటర్ల పైపులైన్లు, అవసరమైన చోట్ల 5 ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణానికి రూ.16.16 కోట్ల నిధులు మంజూరైనట్టు చెప్పారు. మొదటి దశ పనులు పూర్తయ్యాయి. రెండో దశ పనులు త్వరలో పూర్తికానున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ అప్పారావు, సర్పంచు శంఖవరపు వెంకటలక్ష్మి, పసర్పంచ్ ఉండవల్లి గోపి, కార్యదర్శి శ్రీనివాస రావు, సభ్యులు ఉప్పు నరేష్, చిక్కం అన్నవరం, కోటి చుక్కల గంగయ్య ఉన్నారు.



తూర్పుచోడవరంలో జలజీవన్ పనులు పరిశీలిస్తున్న గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈ గిరి

వ్యక్తి అదృశ్యం

కొవ్వూరు: పట్టణంలో గౌతమీనగర్‌కి చెందిన సజీపల్లి దుర్గారావు ఈనెల 26వ తేదీ నుంచి కనిపించడం లేదని అతని భార్య శేషమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు తెలిపారు. మధ్యాహ్నం ఇంటి నుంచి బయటికి వెళ్లి మళ్లీ తిరిగి రాలేదని పేర్కొందన్నారు. పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు.

ఆశ్రమాల తనిఖీ

కొవ్వూరు: హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా తొమ్మిదో అదనపు కోర్టు ఇన్‌చార్జిజడ్జి డి.సత్యవతి క్రిస్టియన్ చారిటబుల్ సొసైటీ, మదర్ థెరిసా అనాథ బాలల ఆశ్రమాలను శుక్రవారం తనిఖీ చేశారు. అక్కడ ఆశ్రయంలో ఉంటున్న చిన్నారుల సౌకర్యాలను, వసతులను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ఆహారం, వసతి, ఇతర సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆశ్రమం రికార్డులను ఆమె తనిఖీ చేశారు.

లాభాల్లో దేవరపల్లి సొసైటీ

దేవరపల్లి: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి 2023-24 సంవత్సరంలో రూ.44.25 లక్షలు నికర లాభం వచ్చినట్టు పర్సన్ ఇన్‌చార్జి కె.ఉషారాణి తెలిపారు. శుక్రవారం సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన మహాజన సభ సమావేశానికి ఉషారాణి అధ్యక్షత వహించి మాట్లాడారు. బైలా ప్రకారం లాభాలను సంఘ సభ్యులకు పంపిణీ చేసినట్టు ఆమె తెలిపారు. సభ్యులకు 12 శాతం డివిడెంట్ ప్రకటించారు. సంఘంలో రూ.8.86 కోట్లు డిపాజిట్లు ఉన్నాయని, రూ.18.70 కోట్లు వివిధ రకాల రుణాలు అందజేసినట్టు ఆమె తెలిపారు. డీసీసీబీకి రూ.14.21 కోట్లు చెల్లించాలన్నారు. రైతులకు అవసరమైన ఎరువులను సిద్ధం చేసినట్టు ఆమె చెప్పారు. ఈ సమావేశంలో సొసైటీ సీఈఓ కేఎస్ఎస్ శర్మ, సొసైటీ మాజీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, కరుటూరి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కాట్రు భీమరాజు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేగేశ్వరపురం సబ్‌రిజిస్ట్రార్‌గా జగన్‌మోహన్‌రావు

తాళ్లపూడి: వేగేశ్వరపురం సబ్‌రిజిస్ట్రార్‌గా జంగారెడ్డి గూడెం నుంచి జగన్‌మోహన్‌రావు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎస్‌కే మౌలానా మండపేటకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మౌలానాకు కార్యాలయ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు గుండా రామకృష్ణ, ఆకుల గణేష్, వారణాసి రవి, శ్రీనివాస్, ఎం వీరబాబు, రెడ్డి, వెంకటరమణ, శామ్యూల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నింటా రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలి

ఉండ్రాజవరం : విద్యార్థులు బాగా చదువుకుని పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని, అందుకు ఉచితంగా అందించే ఈ పాఠ్య పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ మైనం భవానీ అన్నారు. మోర్త మండల ప్రాథమిక పాఠశాల నంబర్-2లో శుక్రవారం సెమిస్టర్-2 ఉచిత పాఠ్య పుస్తకాలను పాఠశాల చైర్మన్ విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్‌ఎల్‌వీ ప్రసాదరావు, స్కూల్ కోఆప్టెడ్ సభ్యులు ఎం.గాంధీ, డి.మల్లేశ్వరరావు, చప్పిడి హనుమంతు, పిండి రాజా ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మ అమ్మవారి హుండీ ఆదాయం రూ.20.85 లక్షలు



తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయ హుండీని శుక్రవారం లెక్కించగా రూ.19,64,972 నగదు, అన్నదాన ట్రస్ట్ హుండీలో రూ.1,20,664 నగదుతో కలిపి మొత్తం రూ.20,85,636 నగదు, 10 గ్రాముల బంగారం, 205 గ్రాముల వెండి ఉన్నట్లు అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. 92 రోజులకు సంబంధించిన అమ్మవారి హుండీని తాడేపల్లిగూడెం తనిఖీదారు ఎ.సుజన్‌కుమార్ పర్యవేక్షణలో ఆలయ కమిటీసభ్యులు, సిబ్బంది హుండీలోని నగదును లెక్కించారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్ల బదిలీ

కొవ్వూరు: డిప్యూటీ తహసీల్దార్‌గా ఎస్.వీరాస్వామి నాయుడు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన కె.అజయ్‌బాబు గోపాలపురం డీటీగా బదిలీ అయ్యారు. వీరస్వామినాయుడు ఉండి నుంచి బదిలీపై కొవ్వూరు వచ్చారు. చాగల్లులో ఎలక్షన్ డీటీగా పని చేస్తున్న కె.నిరంజన్ కొవ్వూరు ఎలక్షన్ డీటీగా బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎలక్షన్ డీటీగా పనిచేసిన ఎం.కమల్ సుందర్ చాగల్లు రీసర్వే డీటీగా బదిలీ అయ్యారు. చాగల్లులో పనిచేస్తున్న రీసర్వే డీటీ కె.ఆనందకుమార్‌ను కొవ్వూరు బదిలీ చేశారు. కొవ్వూరులో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ జి.హేమను జిల్లా కలెక్టరేట్‌కి బదిలీ చేశారు. కోట రామచంద్రపురం నుంచి జి.నాగేంద్ర సీనియర్ అసిస్టెంట్‌గా కొవ్వూరు బదిలీపై వచ్చారు. కొవ్వూరు రీసర్వే డీటీ ఎస్.సాంబశివరావుని గోపాలపురం బదిలీ చేశారు. మరో సీనియర్ అసిస్టెంట్ కె.రామకృష్ణ తాళ్లపూడి బదిలీ అయ్యారు.

నల్లజర్ల డిప్యూటీ తహసీల్దార్‌గా శాంతిప్రియ



నల్లజర్ల: స్థానిక డిప్యూటీ తహసీల్దారుగా వల్లూరి శాంతిప్రియ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆమె రాజమహేంద్రవరంలో పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ ప్రత్యేక కలెక్టరు కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ తహసీల్దారుగా పనిచేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆమె ఇక్కడ వచ్చారు. ఇక్కడ డీటీగా పనిచేసిన కిశోర్‌కుమార్ బదిలీపై ఆకివీడు ఎలక్షన్ డీటీగా వెళ్లారు.

సీఐగా బీఎన్ నాయక్ బాధ్యతల స్వీకరణ



దేవరపల్లి: స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బీఎన్ నాయక్ గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు డీఐజీ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో జంగారెడ్డిగూడెం, భీమవరం, కాకినాడలో సీఐగా పని చేసి ఏలూరు డీఐజీ కార్యాలయంలో వీఆర్‌లో ఉన్నారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన బాల సురేష్ పోలవరం బదిలీపై వెళ్లారు.